క్లుప్తంగా

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



మంగళగిరి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నియోజకవర్గంలోని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతోపాటు ఏ రంగంలోనైనా రాణించే సత్తాగలవారని, వారిని చిన్నచూపు చూడటం తగదన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించడం అభినందనీయమన్నారు.

భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు పంపిణీ



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కల్యాణోత్సవం, దివ్య రథోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారి దర్శనానికి విచ్చేసిన భక్తజన సందోహానికి స్వచ్ఛమైన తాగునీరు పంపిణీ చేశారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఎల్‌జీ వాటర్ ప్యూర్ ఫైర్లతో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని పంపిణీ చేసింది. తాగునీటి కేంద్రాన్ని ఆలయ ఈఓ రామకోటి రెడ్డి ప్రారంభించగా ఎల్‌జీ కంపెనీ బ్రాంచి మేనేజర్ పరుచూరి కిషోర్‌బాబు, మార్కెటింగ్ మేనేజర్ ఎస్ కిరణ్‌కుమార్, విజయ్ డిజిటల్ బ్రాంచి మేనేజర్ కంటె విజయ్ పాల్గొన్నారు.

భక్తులకు వైద్య సేవలు



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం, దివ్య రథోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్యశాల, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఆధ్వర్యంలో ఆలయ సమీపంతోపాటు పలు కూడళ్లలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పలువురు భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

113 తాళ్లూరులో పొలం బడి



ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరులో అమీనాబాద్ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా డీపీఏ అధికారి ఆంజనేయులు, ఏడీఏ ప్రవీణలు ప్రకృతి వ్యవసాయంతో పండిస్తున్న మిరప పంటను, రసాయనిక ఎరువులతో పండిస్తున్న పంటను పరిశీలించారు. ఆయా పంటలు పండిస్తున్న రైతులను వాటి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే పంటల్లో అంతరపంటల వల్ల ఉపయోగాలు వివరించారు. ఎంటీ వరలక్ష్మి, అన్నామణి, ఐసీఆర్పీలు, యూనిట్ ఇన్‌చార్జిలు సీఆర్పీ, పీఆర్పీలు వరప్రసాద్, రామకృష్ణ, మహేష్, తిరుపతిరావు, గాయత్రి, శోభ, ప్రకాష్‌రెడ్డి, సుభాష్, అరుణ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

మంగళగిరి: నగరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీ విద్యార్థులు కారు అతివేగంగా నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. వాహనదారుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. మంగళవారం నగర పరిధిలోని నీరుకొండలో గల యూనివర్సిటీ విద్యార్థులు కారులో గుంటూరు అతివేగంగా వెళుతున్నారు. మార్గంమధ్యలోని చినకాకాని జాతీయ రహదారి వద్ద ద్విచక్ర వాహనదారుడిని వెనుక నుంచి ఢీకొట్టారు. ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులు కారు నెంబరు ప్లేట్లను తొలగించి పెద్దలకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న వారు ద్విచక్ర వాహనదారునితో రాజీ చేసుకుని కేసు నమోదు కాకుండా తప్పించుకున్నారు.

గండాలయ స్వామి కొండ అభివృద్ధికి కృషి

- దాతలు ముందుకు రావాలి
- అన్నదాన మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే. ఎమ్మెల్సీ మురుగుడు



గండాలయ స్వామి సన్నిధిలో అన్నదాన మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థను ఆధ్యాత్మిక, పర్యాటక నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయం, పానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండ, టెంపుల్ హిల్ ఎకో పార్క్, ట్రెక్కింగ్ ట్రాక్‌లతోపాటు గండాలయ స్వామి కొండ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. సుమారు రూ.35లక్షలతో గండాలయ స్వామి కొండపై దాత దేవతి భగవన్నారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన అన్నదాన మండపాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరిని విజయవాడ–గుంటూరు నగరాలకు దీటుగా అభివృద్ధి పర్చడం జరుగుతుందన్నారు. కొండపై అన్నదాన మండపాన్ని నిర్మించిన దాత దేవతి భగవన్నారాయణ అభినందనీయుడన్నారు. మరి కొంతమంది దాతలు గండాలయ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, నేరెళ్ల మురళి పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

వేసవిలో నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడటంతోపాటు అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు నూతనంగా ట్యాంకర్లు కొని అందుబాటులో ఉంచాలన్నారు. చేతి పంపులు, బోర్లు మరమ్మతులకు వచ్చినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కలను పట్టుకుంటే జంతు ప్రేమికులు ఎవరైనా కేసులు పెడితే ఆ కుక్కలను వారి వారి ఇంటికి తీసుకువెళ్లి పెంచుకోవాలని సూచించాలన్నారు. నగరంలో ఇక నుంచి రాత్రి వేళల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెలాఖరు నాటికి గౌతమబుద్ధా రోడ్డు ఎన్నారై వై జంక్షన్ వద్ద వరకూ పూర్తి కావాలన్నారు. భాగవతుల వారి వీధి విస్తరణ పనులు వెంటనే చేపట్టడంతోపాటు మే నెల చివరి నాటికి చేనేత భవనం పూర్తి కానున్న నేపథ్యంలో తెనాలి రోడ్డు విస్తరణకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ గృహకల్ప వద్ద నిర్మాణంలో ఉన్న మగ్గం షెడ్లను పరిశీలించారు. ఈనెల చివరి నాటికి మగ్గం షెడ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా చూడాలన్నారు. నగరంలో పెండిగ్‌లో ఉన్న సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ యు శారదాదేవి, విద్యుత్ ఎస్‌ఈ డాక్టర్ విజయ్‌కుమార్, డీఈఈ అక్కల సత్యనారాయణ, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు రమేష్, కిషోర్, ప్రవీణ్, ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు సామాజిక పెన్షన్ పునరుద్ధరించాలి

ఎంపీ నందిగం సురేష్‌ను కలిసి విన్నవించిన కార్మికులు



ఎంపీ నందిగం సురేష్‌కు సమస్యను విన్నవిస్తున్న కార్మిక సంఘం నేత ఎం రవి, పారిశుద్ధ్య కార్మికులు

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నిలిపివేసిన భూమిలేని నిరుపేదలకు ఇచ్చే పెన్షన్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి కోరారు. మంగళవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ఎంపీ నందిగం సురేష్‌ను కలసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మార్చి నెల నుంచి రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు పెన్షన్ అందిస్తున్నారని తమకు కూడా ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ నందిగం సురేష్ ఆ దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కార్మిక సంఘం నేత రవి తెలిపారు.

కేఎల్‌యూలో జర్మన్ క్లబ్ స్థాపనకు కృషి



జర్మన్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాయలాన్ని జర్మనీకి చెందిన పోట్స్ డామ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించింది. కేఎల్‌యూ ఎంహెచ్ఎస్ డీన్, విదేశీ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ కేఎల్‌యూలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు విదేశాలలో ఇంటర్న్‌షిప్‌లు అత్యధిక సంఖ్యలో సాధించామని అన్నారు. విదేశాల నుంచి తమ విశ్వవిద్యాలయానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో జర్మన్ విద్యార్థుల సౌకర్యార్థం జర్మన్ క్లబ్‌ను స్థాపించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. క్లబ్ స్థాపనకు జర్మనీకి చెందిన పోట్స్‌డామ్ విశ్వవిద్యాలయ బృందం నిధులు సమకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రథ చప్టాలకు పూజలు



చప్టాల బృందం సభ్యులతో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలలో నిర్వహించే దివ్య రథోత్సవం సందర్భంగా ఉపయోగించే చప్టాలకు మంగళవారం రామాలయంలో పూజలు నిర్వహించారు. రథాన్ని నిలువరించేందుకు చప్టాలు వినియోగిస్తారు. ఒక బృందం రథం వెంట ఉంటూ నిలువరిస్తుంటారు. పూజలల్లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు చప్టాల బృందం సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో జువారి సిమెంట్ సౌజన్యంతో సుదర్శని సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సహకారంతో మంగళవారం వడ్డేశ్వరంలోని కృష్ణవేణి ఎగ్జిబిషన్ సొసైటీ మహిళా కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ ట్రైనర్ (3150) అన్నే రత్న ప్రభాకర్, సోషల్ మీడియా డిస్ట్రిక్ చైర్మన్ ఇన్నూరి అనిల్ చక్రవర్తిలు విచ్చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైద్యశిబిరంలో సుమారు 200మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా డ్రాప్స్ మందులు పంపిణీ చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రెసిడెంట్ ఎలెక్ట్ కిరణ్ పరుచూరి, కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, ట్రెజరర్ శెట్టి రామకృష్ణ, రావూరి రమేష్‌బాబు, రవీంద్రారెడ్డి, సుకుమార్‌రెడ్డి, బసివిరెడ్డి, మనోజ్, కృష్ణవేణి ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి రామారావు, జువారి సిమెంట్ గుంటూరు రీజనర్ మేనేజర్ మురళీకృష్ణ, సుదర్శిని కంటి ఆసుపత్రి వైద్యులు టి.అనిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

98 శాతం హామీలు అమలుపరచిన ఏకైక సీఎం జగనన్న



సమస్యలు తెలుసుకుంటున్న సురేష్‌కుమార్

తాడికొండ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి చూపించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయ కర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తుళ్లూరు ఎస్సీ కాలనీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి పేద వాడి సమస్యను తెలుసుకొని సత్వర పరిష్కారం చేసేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, గ్రామాల్లో తిరుగుతున్న తమకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుండటమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకటశివారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఆలోకం సురేష్, నాయకులు మేరిగ తిరుపతిరావు, ఎస్.సందీప్, టి రమణారెడ్డి, ఎన్.నాగేంద్ర, కొప్పుల శేషగిరిరావు, కంతేటి పకీరయ్య, జె.రామారావు, మున్నంగి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీలు

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం



విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జగనన్న గోరుముద్ద పరిశీలనలో భాగంగా స్వయంగా తానే భోజనాన్ని వడ్డించిన ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగా ఉండటం లేదంటూ పలువురి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు అయితే నాణ్యత లేకుండా వండుతారా అంటూ మండిపడి ఇకపై నాణ్యత విషయంలో తప్పు జరిగితే రాజీ పడేది లేదని, ఏజెన్సీని తొలగిస్తామని హెచ్చరించారు. పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గోరుముద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, దీనిపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పాఠశాలకు త్రీఫేస్ విద్యుత్ అందించాలని ఉపాధ్యాయులు కోరగా సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టలో ఎమ్మెల్యే శ్రీదేవి

పొన్నెకల్లు గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి దేవాలయ 14వ వార్షిక ప్రతిష్టా మహోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె 2024లో తిరిగి జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే ఆర్కే



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎంపీపీ రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం గొడవర్రు గ్రామానికి చెందిన బహుజంకు జయలక్ష్మి ఇటీవల మృతిచెందగా మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.25వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డివిఆర్)ల చేతుల మీదుగా అందజేశారు. అదే గ్రామానికి చెందిన గొడవర్తి ఇస్సాకు డెకరేషన్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండగా గ్యాస్ పరికరం పేలి గాయాల పాలయ్యాడు. బాధితుడి కుటుంబ పోషణ నిమిత్తం ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన రూ.25000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెండ్యాల సంసోనమ్మ, గడ్డం శంకర్, పేతురు, గోరంట్ల శ్రీనివాసరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే చేయూత

దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన చిరువ్యాపారులైన తాత లక్ష్మీనారాయణ, గాలి సాయిప్రభలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేయూత అందించారు. దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డివిఆర్) చేతుల మీదుగా తోపుడు బండ్లను అందజేశారు. తమ సమస్యను తెలుసుకుని స్పందించి తమకు తోపుడు బండ్లను అందజేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంచికలపూడి సర్పంచ్ యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గా భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు యేమినేని రవీంద్ర, చిన్నా, వాకా శ్రీనివాసరావు, యార్లగడ్డ మాధవరావు, సచివాలయ కన్వీనర్ యార్లగడ్డ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తగిన ఆహారపు అలవాట్లతో చక్కెరవ్యాధి నియంత్రణ

ఫిరంగిపురం: తగిన వ్యాయామం, ఆహారపు అలవాట్ల మార్పుతో చక్కెర వ్యాధి నియంత్రణలో ఉంటుందని ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న అన్నారు. వేములూరిపాడు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో జన్‌ఔషధి దివస్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎన్‌సీడీసీడీలో భాగంగా ఇప్పటివరకు గుర్తించిన 30మందికి బీపీ, షుగర్ వ్యాధి పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు.

సామాజిక తనిఖీ ఆడిట్ నివేదిక వెల్లడి

తాడికొండ: 2021–22 ఏడాదికిగాను తాడికొండ, తుళ్లూరు మండలాల్లో సామాజిక తనిఖీ ఆడిట్ వివరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వెల్లడించారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించిన సోషల్ ఆడిట్ బృందం సభ్యులు గ్రామసభ నిర్వహించి వివరాలు వెల్లడించారు. పీడీ యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాడికొండ, తుళ్లూరు మండలాల్లో 2021–22 ఏడాదికిగాను మొత్తం 427 పనులను నిర్వహించగా ఇందుకుగాను రూ.6,92,99,443 చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. బండారుపల్లి, దామరపల్లి, ఫణిదరం, గరికపాడుల్లో మొక్కలు తిరిగి నాటించాలన్నారు.